కథానిక

# జ్యోతిష ప్రభావం

"గోపి"

కాలం దొర్లిపోయింది. ఏడాది గిఱ్ఱున తిరిగి వచ్చింది. ఇప్పుడు జయ బిడ్డతల్లి. మూడు నెలల పసిబిడ్డని ఎప్పుడూ పరిశీలనగా చూస్తూంటుంది, అంతమందీ "తల్లినిపోలిన మగబిడ్డ డమ్మా! చాలా అదృష్టవంతుడౌతాడు" అన్నప్పుడు మట్టుకు కొంతవరకూ శాంతి పొందేది...ఇంకా ఏడాది గడువు. రాజా అమెరికానుంచి వచ్చి, మగపిల్లాడిని చూసుకొని సంతోష పడితే కాని జయకి పూర్తి విమోచన రాదు. పల్లెటూరు; పట్టణంలో ఉండే ఏకాంతం కానీ, స్వాతంత్ర్యం కానీ లేకపోవడం, పూర్తి ఏడాది రాజాని చూడకుండా ఉండడం, జయ రూపాన్ని, మనస్తత్వాన్ని పూర్తిగా మార్చేశాయి. జయ తన సర్వస్వాన్నీకూడా, ఒక్క క్షణంలో చెల్లిపోయే పెద్ద లాటరీ టిక్కట్టుకింద మార్చేసింది. ఆనందం పొంగి పొర్లాడుతూ, మనస్సు రాబోయే రాజా కోసం పరుగులు పెడుతూండవల్సింది. కాని అది చలికి కొరడుకట్టిపోయి, స్పర్శలేని చివర భాగాల్లా నిస్పృహతో నిండిపోయింది. కాని బోసినోటి పాపనవ్వులో మాతృత్వపు తియ్యని బాధ్యతల్లో ఒక తృప్తి చేకూరింది. ఏకాఎకీని ఏడు సంవత్సరాలు పిల్లలు లేకుండా కలగడాన్ని ప్రసవవేదన, మనోవేదనల్లో, భగవంతుణ్ణి ప్రార్థించింది. "నా పసిబిడ్డ భూమ్మీద పడగానే నన్ను తీసుకుపో! దీనికోసం మాత్రం నన్నుంచు, అక్కడితో నాపని సరి" అని. "ఎంత బాగుండును, అనుకున్న ప్రకారం పనులు జరిగితే. దేహంలేని తను, రాజా రాగానే "ఇదిగో నోయ్! రాజా! నీ పిచ్చి నమ్మకాన్ని నిజం చేసిపెట్టాను. జ్యోతిషం చెప్పాడు కదూ? అమెరికా ప్రయాణము మగపిల్లవాడూ రెండూను: ఏం? నే జ్ఞాపకం వస్తున్నానా 'నీ' బిడ్డని చూచుకొంటే" ఆలోచిస్తూంటే, అనుకోకుండానే, మనోచిత్రంలో రాజా చింపిరి జుత్తులోంచి తన చేతులుపోయి, రాజా శిరస్సును వక్షస్థలానికి లాక్కొన్నాయి. "అవును, అప్పుడు ఈ చేతులూ ఉండవు. ఈ పునస్సమావేశపు వేడుకలూ ఉండవు." కానీ రాజా నిజాన్ని తెలుసుకుంటేనో: జయా నువ్వొక సామాన్యకులటవు. నీతో నీ బిడ్డతో నాకేం సంబంధం? ఛో! అంటే?...

జయకి చిత్రం వెనక్కి నడుస్తూ కనిపించింది. దాంట్లో ముందువి వెనకా, వెనకవి ముందూ కావడం ప్రారంభించాయి. ఆలోచనల్ని సరిదిద్దుకుంటూ, ఏది ఎలా జరిగింది, ఎవరు ఎంతవరకూ బాధ్యులు, అని విమర్శనా పూర్వకంగా చూస్తూ ఆనాటి విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకుంది.

"నీలో ఏమీ దోషం లేదమ్మా! పిల్లలు కలగడం లేదంటే మీ ఆయనదే లోపం." అంది డాక్టరు సుందరి. డాక్టరంటే సులువుగా, ఆషామాషీ కబుర్లతో చెప్పేస్తే, జీవిత సమస్య తీరిపోతుందీ? ఈ తీర్మానం వినడానికా అంతసేపూ, లేబరేటరీ తలుపులకి కన్నులు అతుక్కుపోయేట్టు చూచింది? గుండెదడ తన అత్మ్రించూసి నవ్వుతారనే భయం...తీరాచూస్తే ఇదా డాక్టరు చెప్పబోయే పరీక్షా ఫలితం? ఏం? ఎంతత్యాగం చెయ్యాలని పరీక్షకి తెగించి వెళ్లింది? ఆవాళ డాక్టరు; 'నీకు పిల్లలు కలగరమ్మా నిజంగా మీ ఆయనకి పిల్లలంటే అంత ముచ్చటైతే, మరోపెండ్లి చేసుకోవాలమ్మా" అంటే, తప్పకుండా రాజా ముచ్చట తీరడం కోసం, మరో పెండ్లిచేసి, వారిద్దరి మధ్యా నలిగిపోతూన్నప్పటికీ, "గొడ్రాలు" అని దెప్పినప్పటికీ, 'సవతి'గా ఉండడానికి నిశ్చయించి మరీ పరీక్ష చేయించుకుంది. "హాస్పిటలు వాసనలాగే మీ పరీక్షలు, మీ సలహాలు, మీ మందులు అన్నీ కంపే"అని దెప్పింది డాక్టర్ సుందరిని. "చాల్లే అంత మందీ వెళ్ళిపోయినా అఘాయిత్యంగా ఆ బెంచీమీదే చలికిలపడి పోయావు పద" అని.

సుందరి కార్లోకి నెట్టింది. "రాజాకి ఉండే పిల్లల మీది మమకారం తెలిసిన వాళ్ళకి గానీ..."అని ఏదో చెప్పబోయింది. "ఒహో! ఏదో మిన్ను విరిగి మీద పడ్డట్టు చెప్పుకొస్తున్నావు." అని గదమాయించింది సుందరి.

"ఇప్పుడేం చెయ్యమంటావు సుందరీ? ఈ విషయం ఆయనతో ఎల్లా చెప్పేది? నాకేం ఫరవాలేదు. కానీ ఎటొచ్చీ పిల్లలమీద మోజంతా ఆయనదే." అని జయ ఎంతో దీనంగా చెబితే, సుందరి నవ్వేసి, "నీ చేతిలో ఉన్న పనది. ఎవడు చూడొచ్చాడు. సంసారం సాఫీగా నడవాలంటే చాలాపనులు చెయ్యాలి" అన్నాదెంతో తేలిగ్గా, లాటరీ టిక్కట్టు అమ్మేవాడి ప్రకటనలా. "ఛీ! ఛీ! అదొక్కటే తక్కువ నాబ్రతుక్కి" అని చీదరించుకున్నా తరువాత జరిగిన సంఘటనల కన్నిటికీ, తెరవెనుక మనస్సులో జరగబోయే నాటకానికి, కథా, పాత్రలూ తయారౌతున్నాయని ఇప్పుడర్థం చేసుకుంది.

పాపం రాజాకేం తెలుసూ ఈ పరిస్థితంతా! అవాళ శుభవర్తమానం, అమెరికాదేశానికి రెండేళ్ల డెప్యుటేషన్ (Deputation) గా రాజాని పంపించ దల్చినట్లు! దాంతో పిచ్చిగంతులు వేసుకుంటూ ఇంటికి వచ్చేసి, ఒకటే సందడి చేయడం ప్రారంభించాడు. అమెరికా వెళ్ళడం గురించి కాదా గడబిడ. జోతిష్యం నిజమౌతుందని. సముద్రయానం, మగపిల్లడు కలగడం ఈ రెండూ చెప్పాడా జోతిష్యంలో! "ఏం నేనమెరికా వెళ్ళడం నీ కిష్టంలేదా?" అని సూటిగా అడిగాడు జయ నిరుత్సాహాన్ని చివరికి గుర్తించి. జయ ఆరాటం రాజా అమెరికా వెళ్ళిపోతాడని కాదు. డాక్టరు చెప్పిన సలహా, దాంతోపాటు రాజా నుంచి ఎడబాటు, తనలో ఎలాంటి తిక్కవస్తుందోనని-లేని అపహాస్యం తెచ్చుకొని చెప్పింది. "మరేం మీరంటే దొరసాన్లమధ్య జల్సా వెలిగిస్తారు. నేనొక్కత్తెనే ఇక్కడ పడేదుస్తాను. నన్నుకూడా తీసుకెళ్ళండి." అని గునిసింది.

"తప్పు జయా! నువ్విల్లా అల్లరిపెట్టొచ్చునా! రెండేళ్ళనగా ఎంత! సముద్రప్రయాణం, ప్రమోషన్, మగపిల్లవాడు...జ్యోతిష్కుడు చెబితే వెర్రివెంగళాయకింద కట్టి ఎగతాళి చేశాం." అంటూ చెప్పిన రాజాని తేరిపారి చూచింది జయ. రాజా అమాయకపు కన్నులతో పిల్లలమీద రాజాకుండే మమకారాన్ని ఆవేదనతో, గుర్తించింది. "పోనిస్తురూ మీవన్నీ పిచ్చి నమ్మకాలే. జోతిషం మీద నమ్మకాలు పెట్టుకుంటే బ్రతికి బాగుపడ్డట్లుగానేఉంది." అన్నది జయ. అతనికి డాక్టరు చెప్పింది చెప్పేదామా అనుకుంది. అది కాస్తా తెలిస్తే అమెరికా వెళ్ళడు సరికదా పిచ్చెత్తుతుందో సన్యాసమే పుచ్చుకుంటాడో కూడా నిశ్చయించలేక పోయింది. ప్రతీ చిన్నవిషయంలోనీ తీరని మమకారాన్ని పిల్లలపై చూపించే రాజాతో, పిల్లలులేకుండా ఎల్లాసంసారంచెయ్యాలీ అన్న ఆందోళన రోజుకు రోజూ ఎక్కువ కావడం ప్రారంభించింది జయకు.

జయ, రాజాలు ప్రయాణం దగ్గరపడుతూన్న కొద్దీ మరీ పిచ్చివాళ్లైపోయారు. అసలు, రాజా జయ లేనిదే ఒక్క నెల కూడా, ఆరేడు సంవత్సరాల బట్టీ ఉండలేదు. పుట్టినింటికి జయ పోయినప్పుడు రాజా సెలవుపెట్టి వెనకాలే వెళ్లి మళ్ళా తీసుకొవచ్చేసేవాడు. జయ తల్లిదండ్రులు అన్యోన్యానికి ఆనందపడ్డా 'ఇదెక్కడి చాదస్తంబాబూ' అని విసుక్కునేవాళ్ళు కూడా.

పాపం జయకి అన్నిటికంటె పెద్ద గొడ్డలిపెట్టు బొంబాయిలో ఆఖరు నిముసం. "నే రాను బొంబాయి" అంది జయ. "రాక తప్పద"న్నాడు రాజా. సరి పదిరోజులు బొంబాయిలో కూడా వెలిగించారు కలిసి. పడవ వెళ్ళిపోయే ముందు, జయ చేతులు పుచ్చుకుని, కళ్ళు చమ్మగిల్లగా, చెవిలో చెప్పి, "రాస్తావు కదూ! తప్పకుండా! సిగ్గుబడకేం!" హెచ్చరించాడు రాజా. వివర్ణమైన జయ ముఖం రాజాకి కనపడకుండా తిప్పేసుకుంది. సరి, నాలుగురోజులు పాటు జయ హాస్పిటలు గడపలు దాటినదగ్గరనుంచీ బొంబాయిలో పడవ మీది ఆఖరి ఘట్టంవరకూ మథనానికి తెచ్చుకుంది. "సిగ్గులేదీ మగవాళ్లకి!" అనుకుంది. రాజా మీద తీరని అసహ్యంవేసింది. క్షణికంగా "ఛీ! పిల్లలంటే అంత ఇదవకూడదు. ఆడాళ్లకైతే సరిపోయింది కానీ..." అని ఏవగించుకుంది. పగిలిపోయే కుండని ఆతకడానికి ప్రయత్నం చేసినట్లనిపించింది.

దాచిన సత్యం రాజాతో వెళ్ళపుచ్చక పోవడం పోటీ పందెంలో పాల్గొనే ఆప్తమిత్రులు, ఆశించిన ద్వంద్వ విజయం చేకూరక ఎల్లా బాధపడతారో నిజం చెప్పినా చెప్పకపోయినా, బాధ తప్పదని నిశ్చయించింది జయ. ఎత్తు పొడుగు, ఉన్నతస్థితి ఆరోగ్యం ఉన్న రాజా పిల్లల్ని కనడానికి పెట్టిపుట్టలేదనే వార్త విని భరించగలడూ? డాక్టరు చాలా తేల్చిగా చెప్పినప్పటికీ... ఛా! నా బుద్ధి ఇప్పుడే వక్రం పోతున్నాది" అని తన మనోచిత్రంలో హాస్పిటళ్ళు, అనాధ శరణాలయాలు పెంటకుప్పలు చాలా వెతికింది దాంట్లోంచి ఒక చక్కటి మగబిడ్డని వెతికింది; అప్పుడే పుట్టేడు, పాపం తల్లి చనిపోయింది ఆ బిడ్డని హృదయానికి అత్తుకుంది. ఎఱ్ఱని నోటివిప్పి పాలకోసం పయ్యటలో గిలిగింతలు పెడుతున్నాడు బిడ్డ." ఎంత సుఖం! ఎంత కష్టం! బిడ్డకి పాలెల్లా ఇవ్వడం? ఆబిడ్డ ఆకలిరోదనకి శాంతేంటి? పెంపుడు బిడ్డ ఇచ్చే మాతృత్వం? ఛీ! సొంతబిడ్డ,...సొంతబిడ్డ పాలతో ఉబ్బిన వక్షస్థలాన్ని, చిన్నినోటితో, తణుముకుంటే పెట్టే గిలిగింత, మెత్తని చేతులతో ముక్కూ నోరు పీకుతుంటే ఉండేసుఖం..." ఆమె గుండె మనోవేదనతో నిండిపోయింది.

* * *

పల్లెటూరు చేరుకుంది. కాలం గడపడమే గండంగా ఉంది. రోజు వెళుతూన్నకొద్దీ రాజాకి ఉత్తరం ఏమివ్రాయడం..? రాజాకి "అబ్బే ఏమీ లేదు మనం ఉత్త పిచ్చివాళ్ళం" అని ఎలా వ్రాయడం? రాజా తనకు నిస్సంశయంగా పిల్లాడు పుడతాడనే నమ్మకంతో కడవెళ్ళాడు...

"ఏమిటే జయా! నీకేం మతిపోయినట్లుంది. ఏవిటది మీ ఆయనగారి మీదేనా ఆ ధ్యాసం?" అడిగింది తల్లి. నవ్వింది జయ. "ఏవిటో ఎవరిదశ ఎప్పుడో విన్నావూ రాఘవులు ఇప్పుడు సినీమాలో ఏదో పెద్దపని చేస్తున్నాట్ట. రేపెల్లుండిలోగా దిగుతాట్ట. ఇంకా, భాగోతపాళ్ళా ఆ గిరజాలు, కూని రాగాలు, పిచ్చిపిచ్చి బొమ్మలూ! పదేళ్ళపాటు ఇంటికి రాలేదు సుమీ జయా! ఏదో చిన్నప్పుడు కాబట్టి సరిపోయింది. సినీమావాళ్ళకి సిగ్గుండదుట జాగ్రత్త సుమీ వాడు నువ్వున్నావంటే మన గడప వదలడసలు..." అని జయ తల్లి తనకి తోచిన విషయాలన్నీ చెప్పుకుపోయింది.

"మరేం ఇంకా లోలబొప్పికి చెప్పినట్లు చెప్పు. వాణ్ణి చూస్తే నాకెప్పుడూ తిక్కే..." ఈ పల్లెటూళ్ళవాళ్ళందరూ ఇంతే; వీళ్ళ కెంతసేపూ అనుమానాలే అని కసురుకుంది.

జయ నాలుగు రోజులు పల్లెటూళ్లో ఉందో లేదో ఎవరిమీదో ఒకరిమీద, ఏదో ఒక అపవాదు వింటూనేఉంది. బహు స్వల్ప విషయాలు, దోషాల్లా చెప్పుకోడం, అవి నీలిగురించి అసహ్యించుకొంటూన్న అనసూయలు, ఎలా స్వేచ్ఛగా వాటి గురించి మాట్లాడుకుంటారో అర్థంకాలేదు...

సాయంకాలం చల్లగాలికి కాలువగట్టుకి దారితీసింది. రైతులు వాళ్ళ సతీమణులతో కూడా పొలంపాటు పూర్తిచేసి, సరంజాం సర్దుకుంటున్నారిళ్ళకి పోవడానికి. "ఏం జయేనా అది? ఎవరో అనుకున్నాను." అంటూ నవ్వు మొహంతో రాఘవులు ప్రత్యక్షం. జయ ముభావంగా పలకరించింది. ఎవరేనా చూస్తారేమో అని జయ చాలా భయపడుతూనే ఉంది. రాఘవులు మేనత్తకొడుకు. చిన్నప్పుడు ఇంట్లో "ఏం జయా రాఘవుల్ని పెళ్ళాడుతావా?" అని రాఘవుని బొమ్మో అమ్మో అడుగుతే, 'ఛీ' అనేది అనుకోకుండానే. ఇద్దరి సంసారాల ఆర్థికస్థాయి, స్థితిగతులు వేరుకావటాన్న, "నీపొగరణగ్గొట్టేవాడు వస్తాడులే" అని మేనత్త దీవించడంకూడాకద్దు. రాఘవులకిమట్టుకు జయతో మాట్లాడ్డమన్నా ఆటలన్నా, ఒళ్ళు తెలిసేదికాదు.

'ఇదేం పట్నవాసం కాదుసుమీ-సుద్ధపల్లెటూరు' అని హెచ్చరించింది.

"ఓస్! నువ్వూ నేనూ పల్లెటూరువాళ్ళం కాదుగా, ఫరవాలేదులే." అని జబాబిచ్చాడు రాఘవులు.

ఇహ నట్టే నడవటం మంచిదికాదని తిరిగి వచ్చేసింది.

"ఏమే జయా! నిన్న రాఘవులు నిన్ను వెంటపెట్టేట్ట! నిజమేనా."అడిగింది తల్లి. నవ్వింది జయ. కానీ నిన్నటి షికారు, ఊరి పిల్లాది మొదటా జంటకావ్యంగా చేసిందని అర్థమైంది.

జయ ఇంతవరకూ చాలా తిన్నగా గుర్తుకి తెచ్చుకోగల్గింది ప్రతీ చిన్నవిషయం కూడా. కానీ, బ్యాంకువాళ్ళ పిలుపు, పట్టణాలలో పని,

ముఖ్యంగా నాలుగు రోజులు రాఘవుల్ని ఒదిలించు కుందామని పట్టణం రావడం, కాకతాళీయంగా రాఘవుల్ని సినిమా హాల్లో కలవడం, రాఘవుని ఒదిలించుకోకపోవడం సరికదా, రాఘవునితో ఒక రాత్రి ఒకేమత్తులో మైకంలో వెళ్ళిపుచ్చడం, వీటికి కారణం కాని వరస కానీ ఏమీ ఒక తిన్నగా జ్ఞాపకంరాలేదు. రైలుదిగి డాక్టర్ సుందరి ఇంటికి రావడం, సుందరి కార్లో ప్రయాణంకి సిద్ధంగా ఉండటం బాగా నేడుంది. "జయా! నువ్వు సరిగ్గా టైముకొచ్చావు నే ఢిల్లీ వెళుతున్నా. రైలు మించ బెట్టకు. నే వచ్చేవరకూ మాత్రం ఉండు విజయవచ్చి మందులు వైద్యం నా తరఫున నడిపిస్తుంది. చిన్నది నువ్వు కాస్త దగ్గరుండి, చూస్తూండు... కాదనకు టా! టా!..." అంటూ వెళ్ళిపోయింది సుందరి.

సినీమా విడిచాక కథలో మత్తో అవాళ పడవ లోంచీ వ్రాసిన రాజా ఉత్తీరంలోని పిచ్చి ఆశలో, వెన్నెలో, సుందరి ఇంట్లో ఒంటరి తనమో, లేక ఏమో కానీ—సినిమాలో కాకతాళీయంగా కలిసిన రాఘవులు తియ్యని కబుర్లు చివర 'నే కూడా వస్తా' నంటే సరే అనిపించాయి జయ చేత. ఒక్కటి మాత్రం జయకి బాగా జ్ఞాపకం ఉంది. "ఇదిగో! ఇదే మన ఆఖరిసారి మొదటిసారీ కలవడం. మళ్ళా ఎప్పుడన్నా నన్ను చూడ్డానికి ప్రయత్నంచేశావా" మాట తీక్షణంగా సగంలో ఆగిపోయింది. మంత్ర బద్ధమైన సర్పంలాగే బుర్రూపేడు రాఘవులు. "ఏముంది ఏది ఎలాగ జరిగినా, రోకటిలో తల కాయపెట్టి రోకటి పోటుకి వెరవడ మెందుకు?" అన్న స్థితిలో పడిపోయింది జయ.

* * *

రాబోయే పోరాటానికి తయారయ్యే ముఖ్య సైన్యాధిపతిలా ఆరాటం పొందడం ఆరంభించింది జయ. రాజా ఒక వారంలో వస్తాడింక. రాజా రాకుండానే ఆత్మహత్య చేసుకుందామనుకుంది. పసిబిడ్డ ఆటలు, అసహాయత, ఇంతకీ రాజా ఏమీ అనందే! ఆలోచనల్నీ రాబోయే సన్నివేశాలను చద రంగంలో ఎత్తుల్లా బొత్తు పడుతూన్నాయి. దాంతో నిద్దర, ఆహారం రెండూ శూన్యమయ్యాయి. ఇహ బొంబాయినించి "సురక్షితంగా చేరాను రేపొ స్తున్నా"నన్న నాటికి జయకి ఒళ్లు తెలియని జ్వరం. ఎంత కాలం తెలివి లేకుండా మంచమ్మీద పడుందో కూడా గుర్తులేదు. కన్ను తెరిచి చూచే సరికి రాజా రాముని ఎత్తుకొని, వింతవింత బొమ్మలు విప్పారిన కన్నులతో చూపిస్తూన్నాడు.

"పిచ్చి పిల్లా. నేనొస్తానింక అనే ఆరాటంలో నిద్రపోకుండా, అన్నం తినకుండా ఉష్ణం పెట్టు కున్నావా? భలేదానివి నువ్వు త్వరగా తేరుకోపోతే నా కొత్త ఉద్యోగానికీ పోయేదెట్లా?" అమాయి కంగా రాజా కన్నులు ఎప్పటిలాగే వెలిగాయి. జయకి ఉష్ణం విడిచింది.

* * *

జయ తన కురుచపడిన తెల్ల వెంద్రుకల్ని దువ్వు కుంటూ, రాము రాకకోసం ఆత్రతగా ఎదురు చూస్తూంది. రాము, కాలేజీకి వెళ్ళి మొదటి శల వలకి రావాలి. అప్పుడే నాలుగురోజులు ఆలశ్యం చేశాడు. అన్నెల్లబట్టి చూడలేదు రామూని. ఎల్లా ఉండగలిచానో అని ఆశ్చర్యపడుతూంది జయ. రాజా ఆఫీసుకి శలవుపెట్టి స్టేషన్‌కి వెళ్ళాడు, కనీసం రెండు గంటలముందుగా! "అవును, కాలేజీ పుస్తకాలు పెట్టుకుందికి రామూకి అల్మారీ ఏదీ!" జయ జుట్టు ముడేసేసి రాజా పుస్తకాల అల్మా రీలో అడుగుఅర ఖాళీచెయ్య నిశ్చయించింది. ఊసుపోని పనిలా రాజా అమెరికా డయరీ తిరగ వేసింది. మొదటి పడత తిప్పగానే "డాక్టర్ రేపు రమ్మన్నాడు ఫలితానికి" రెండో పేజీలో ఉంది. డాక్టర్ నాకు పిల్లలు పుట్టరని స్పష్టంగా చెప్పేడు కానీ జయ, నే వ్రాయమన్న ఉత్తరం 'పండేనని' వ్రాసిందే? అదీ ఇవాళే రావాలీ?" ఇంక ఆగకుండా గబగబా తిరగవేసింది. "మగపిల్లాడు పుట్టాడు. బహుశా డాక్టరు పొరపాటుపడ్డాడు. ఈ విష యము మళ్ళా డాక్టరు దగ్గరికి వెళ్ళను. నా జయ దోషంచేసినట్లు ఎందుకు తెలుసుకోవాలీ? బహుశా చేసినా, దానికి కారణం నేను నా పిచ్చినమ్మకాలూ! ఆమెకి ఎటువంటి అనుమానమూ కలక్కూడదు..."

జయ కన్నులు చమ్మగిల్లాయి. ఇరవై ఏళ్లు గడిచాయి. తరువాత సంసారం రాజా తన ఉదా రతతో స్వర్గతుల్యం చేశాడు. "రాజాకి తెలుసు-తెలిసీ క్షమించాడు ... జయకి తీరుబాటుగా కూర్చుని ఏడవాలనిపించింది, సంతోషం దుఃఖం రెండిటితోనూ, త్వరగా పుస్తకాలు సర్దేసి అల్మారా తయారు చేసేసింది.

జయ తీరుబాటుగా డైరీలు తిరగవేస్తే ఇంకా మరో చిన్న విషయం తెలిసి ఉండేది. అదేమంటే:

ఒకనాటిసాయంకాలం చీకటిచీకటి పడుతోంది. జయ రామూని వెంటపెట్టుకొని పక్కింటావిడ తోడుగా సినీమాకివెళ్ళింది. అది రాజా ఉత్తరాదిని కొత్తఉద్యోగంలో పనిచేస్తూన్న నాలుగో ఏడాది.

"రాజాగారి ఇల్లు ఇదేనా?" అన్న తెలుగు గొంతుక ప్రశ్నకి ఆప్యాయంగా రాజా తలుపు తెరచి ఆగంతకుణ్ణి ఆహ్వానించాడు.

"నా పేరు రాఘవులు. జయకి కొంచెం దగ్గర బంధువుని కూడా. ఇద్దరం ఒకే ఊళ్ళో పుట్టి పెరిగాం. ఇలా దగ్గర ఊరికి పనిమీద రావడాన్న చూచిపోదామని వచ్చాను."

రాఘవుని ఆకారం, మనిషివాలకం, రాజాలోనే ఏవో తెలియని పిచ్చి ఆలోచనలు కలిగించాయి.

రాజా చిరునవ్వు నవ్వి "అరే! మీ రొక్క రోజూ ఆలస్యంగా వచ్చారు. జయ దేశంవెళ్ళింది. ఒకటి రెండు నెలలువరకూ రాదే" అన్నాడు. రాఘవులు భూమ్మీదికి కుంగిపోయాడు. సినీమా రంగంలో ఒకరోజు, పాదుషా ఒకరోజు బికారిగా తిరిగే రాఘవులుకూడా రామూనొక్కసారి చూచి పోదామనివచ్చినట్లు సులువుగాగ్రహించాడు రాజా. "రక్తస్పర్శ అన్నది ఎంత చెడ్డవస్తువు!" అనుకుని నిట్టూర్చాడు రాజా.

స్కెచ్

# అవతారం అదృష్టం

ఎస్. ఎన్. ప్రభల

మా అవతారం పదహారవ ఏట స్కూల్ ఫైనల్ పరీక్షకు వెళ్ళాడు. ఆ వేసవిలోనే—అంటే యింకా ఫలితాలు ప్రకటింప బడకుండానే—'అబ్బాయి' అందచందాలకూ, యింతవరకూ ఒక్కసారైనా ఫెయిలవకుండా పైకి వస్తూన్నందుకూ 'ప్రతిఫలం' లాటిది ఒకటి తటస్థించింది. చుట్టు పక్కలఉన్న ప్రతి గ్రామంనుండీ ఆడపిల్లలున్న పెద్ద మనుషుల తాలూకు ప్రతినిధులు పార్వతమ్మగారిని ఆకాశానికి ఎత్తేయడం ప్రారంభించారు.

"ఆయనుంటే రత్నంలాటి పిల్లాణ్ణి చూసి ఎలా మురిసిపోయేవారో. ఆ వినయవిధేయతలూ అవీ ఈ రోజుల్లో ఎవరి కుంటాయమ్మా!" అని ప్రారంభించి, మాటలలోకి దింపి, "మాటవరస కంటున్నాం తల్లీ! పట్నం, పైచదువులకు పంపిస్తున్నారుకదా. ఎటుపోయి ఎటొస్తుందో చేతినిండా డబ్బు, చిన్న తనం చూడండీ యిప్పుడే ఓ యింటివాణ్ణి చేస్తే ఎటు పోయి ఎటువచ్చినా 'మనవాడే' అవుతాడు." అనేసి ఊరుకుంటారు.

దానితో ఆవిడకు కంగారుపట్టుకుంది. ఊళ్లో ఒక పెద్దను పిలిచి ఆ వేసవిలోనే ఉపనయనం, వివాహం రెండూ ఒక్కసారే అయాయనిపించారు. అవతారం అదృష్టవంతుడని అందరూ ఒక్కసారి అనుకున్నారు.

అంతే—మరుసటేడే మావగారిచ్చిన సైకిల్ మీద రొమ్ము విరుచుకుని కాకినాడ రోడ్లన్నీ తనవే నడం ప్రారంభించాడు.

* * *

"అదృష్టం ఉంటే అన్నీ యిలాగే కూడుకు వస్తాయి." అన్నారు పార్వతమ్మగారు ఓసారి.

ఏమిటండీ అంటే 'వ్యక్తురాలు' ఆవకుండా పిల్లకు పెళ్ళి చేశామన్న గౌరవం వారికీ, కట్నం మాటటుంచి చిన్నపిల్లను తెచ్చుకున్న గౌరవం తనకూ దక్కిందంటే, అంతా 'అంతే'నంటారావిడ!

ఇలా యిప్పుడావిడెందుకంటున్నారో నా కర్థంగాక మా అవతారంకేసి చూస్తే మావాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ ఓ 'శుభలేఖ' లాటిది నా చేతిలో పెట్టాడు.

ఇహనేం!

'సౌభాగ్యవతి లక్ష్మి శుక్రవారం ఉదయం... అనీ, ఆ తర్వాత శాంతీ గింతీ అవీ చేయించాలనీ, ముచ్చట్లు మురిపాలూ తీర్చుకుందుకు రమ్మనీ;ఇంకా యింకా అంతా అలాగే పోయింది ధోరణి. మా వాడి ముఖంలో ఏదో విజయగర్వం అవుపిస్తోంది!

ఇంటర్ జూనియర్ వేసవిలో మావాడి మకాం అత్తవారి ఊళ్లోనే!